క్లుప్తంగా

ముగిసిన ముద్దల పండుగ

వీరపునాయునిపల్లె : మండలంలోని మొయిళ్ల చెరువు, కొమ్మద్ది, అంకిరెడ్డిపల్లె, వెల్దుర్తి, కీర్తి పల్లె, అలిదెన గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ముద్దల పండుగ ఘనంగా ముగిసింది. ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలకు జంతు బలులు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకోవడంతో పాటు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. అలిదెన మాజీ సర్పంచు వాసుదేవరెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చివెళ్లి గ్రామ సమీపంలో ఉన్న అచ్చివెళ్లి గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మ వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించు కోవాడానికి కడప, కర్నూల్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు తరలి వస్తారు. భక్తులకు అర్చకుల అభిషేకాలు, పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందచేస్తారు.

జగనన్న బస్సు యాత్రను జయప్రదం చేయండి

చక్రాయపేట : ఈనెల 27న ఇడుపులపాయ నుంచి ముఖ్యమంత్రి జగనన్న చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : స్థానిక పోలీసులు ఆదివారం రెండు వేర్వేరు ప్రదేశాల్లో పేకాట ఆడుతున్న జూదరులను అరెస్టు చేశారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు జమ్మలమడుగు రహదారిలో చెరువుకు సమీపంలో పేకాట ఆడుతన్న 5 మంది జూదరులను అరెస్టు చేసి వారివద్దనుంచి రూ. 6,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం యామవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2,200 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

28న బండలాగుడు పోటీలు

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో మాధవరాయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా న్యూ కేటగిరి వృషభరాజులకు బండలాగుడు పోటీలు ఈనెల 28న నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50,000 మొదలుకుని పది బహుమతులు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9948295014, 8500321208 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

కమలాపురం : ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని జూన్ 6వ తేదీ వరకు ఈ కోడ్ అమల్లో ఉంటుందన్నారు. కోడ్ అమల్లో ఉన్నప్పుడు సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితరవి చేయాలంటే తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే ఇవన్నీ చేసే సమయంలో టపాసులు కాల్చడం పూర్తిగా నిషిద్ధం అన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

కల్యాణ మండపం డెకరేషన్‌కు టెండర్ల ఆహ్వానం

కడప అర్బన్ : కడప నగరంలోని ఉమేష్ చంద్ర స్మారక కల్యాణ మండపానికి సంబంధించి డెకరేటర్ల నుంచి దరఖాస్తులను ఈ నెల 29 వరకు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2024–25 సంవత్సరానికి గాను ఈ టెండర్స్ ×పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 22 నుంచి తీసుకుంటున్నారన్నారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టెండర్ బాక్స్‌లో రహస్య టెండర్ సీల్ట్ కవర్స్ వేయాలన్నారు. ఈ టెండర్స్‌లో డెకరేషన్ కాంట్రాక్టర్స్ కనపరిచిన మొత్తం అమౌంట్ కల్యాణ మండపం కమిటీ మెంబర్స్‌కు అంగీకారమవ్వాలన్నారు. అట్లు లేనియెడల సదరు టెండర్స్ రద్దు పరచి మార్చి 30వ తేదీన ఉదయం 10 గంటలకు కడప జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్‌లో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ కోర్సులో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయి 18–26 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులకు శిక్షణకు అర్హులన్నారు. 35 రోజుల పాటు ఇచ్చే శిక్షణలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లిషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో ఉచితంగా శిక్షణా ఇస్తామన్నారు. అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కూడా ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయ్యాక వివిధ సంస్థల్లో రూ.15 వేలకుపైగా వేతనంతో ఉపాధి చూపడం జరుగుతుందన్నారు.

కొండసుంకేసుల.. అభివృద్ధి జోరు

అది జిల్లాలోని మారుమూల గ్రామం. జిల్లా కేంద్రానికి 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. మండల కేంద్రానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామం జనాభా 2,300, ఓటర్లు 1,600 మాత్రమే.. అయినా గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, వాటర్ ప్లాంట్ నిర్మాణం, సి.సి.రోడ్లు ఏర్పా టు చేసి పల్లెకు కొత్త రూపు తీసుకువచ్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. పెద్దముడియం మండలం కొండసుంకేసుల గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.82 లక్షలతో గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ క్లినిక్ నిర్మాణం
- రూ.37 లక్షలతో సి.సి.రోడ్లు
- డీబీటీ ద్వారా రూ.30.09 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 4.21 కోట్లు లబ్ధి పొందిన గ్రామస్తులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


కొండసుంకేసులలో గ్రామ సచివాలయం

పెద్దముడియం: జాతిపిత కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేసింది. పట్టణాలకు ధీటుగా పల్లెలను అభివృద్ధి చేసింది. నాడు కనీస సౌకర్యాలు లేక నిత్యం పనుల నిమిత్తం మండల, నియోజక వర్గ కేంద్రాలకు తిరగాల్సిన దుస్థితి, అయినా గత పాలకులు కరుణించలేదు. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో వివిధ ప్రభుత్వ కార్యలయాలు ఏర్పడిన తరువాత అర్హులకు సంక్షేమ పథకాల వర్తింపు, పల్లె సీమల రూపు రేఖలు మారిపోయాయి. మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో 730 కుటుంబాలు ఉండగా 1,600 ఓటర్లు, 2300 జనాభా ఉన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సహకారంతో గ్రామంలోని 200 ఎకరాల ప్రభుత్వ భూమిని 120 మంది నిరుపేదలకు 1.5 ఎకరాల చొప్పున పంపిణీ చేశారు. అంతేకాక ఎంపీ, ఎమ్మెల్యే చొరవతో గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు కావడంతో నిర్మాణ పనులన్నీ పూర్తి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు..

- రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం
- రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్
- రూ.10 లక్షలతో నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి
- రూ.37 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.23 లక్షలతో పైపులైన్,వాటర్ ప్లాంట్ నిర్మాణం
- రూ.34.31 కోట్లు వివిధ పథకాలతో గ్రామస్తులు పొందిన లబ్ధి


గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్


గ్రామంలోని రైతు భరోసా కేంద్రం


ఎంపీ నిధులతో నిర్మించిన వాటర ప్లాంట్

ఎమ్మెల్యే, ఎంపీ చొరవతో గ్రామాభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి చొరవతో మా గ్రామంలో అనేక సమస్యలు తొలగిపోయాయి. దాదాపు ప్రతి సమస్యకు పరిష్కారం చూపారు. భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేసిన ఘనత ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డికి దక్కింది. అన్ని విధాలుగా గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే సాయం మరువలేం.
– భాస్కర్ రెడ్డి, కొండసుంకేసుల

ఇబ్బందులు తొలగిపోయాయి



ప్రతి చిన్న పనికి పెద్దముడియం, జమ్మలమడుగుకు పోవాల్సివచ్చేది. రవాణా సౌకర్యం లేకపోవడం, దూరంగా ఉండటంతో చాలా కష్టాలు పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలోనే గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటుతో మా ఇబ్బందులు తొలగిపోయాయి. పనులు మానుకుని పోవాల్సిన అవసరం లేకుండా పోయింది. ఊర్లోనే సేవలు అందుతాయని ఊహించలేదు.
–చంద్రశేఖర్‌రెడ్డి, కొండసుంకేసుల

ఇఫ్తార్ విందు పుణ్యకార్యం

కమలాపురం : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించే ముస్లిం సోదరులకు ఉపవాసాలు విడిచే సమయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఎంఎల్‌సీ రమేష్ యాదవ్ తెలిపారు. ఆదివారం రాత్రి కమలాపురంలోని పెద్ద దర్గాలో వైఎస్సార్ సీపీ మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. అంతకు ముందు దర్గా–ఏ–గఫారియా, జహీరియాలో స్వాముల వారి మజార్లపై పూల చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందుకు తాము రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే రాష్ట్రం అంతా చల్లగా ఉండాలంటే జగనన్న ప్రభుత్వం తిరిగి రావాలన్నారు.


ఇఫ్తార్‌లో దువా చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంఎల్‌సీ రమేష్‌యాదవ్

చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనంతా అవినీతి, కరువులతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించారన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇంటికే చేరుతున్నాయని ప్రజలంతా జగనన్న పాలన తిరిగి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి స్వామి, గౌస్‌పాక్, జియా, సర్ఫరాజ్, నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

పులివెందుల రూరల్ : గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు గ్రామాలలో ప్రజలు సహకరించాలన్నారు. ఎవైన సంఘటనలు జరిగేతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అరుణ్‌రెడ్డి

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

కమలాపురం : పట్టణంలోని సీఎస్ఐ, టీసీసీ, తెలుగు మండల సభ, ఆర్‌సీఎం, మన్నా తదితర చర్చీలలో మట్టల ఆదివారంను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చిలో రెవరెండ్ సౌత్ సౌశీల్యా గురువులమ్మ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, యువతీ యువకులు, బాల బాలికలు ఖర్జూరపు, ఈత మట్టలు చేతబట్టి పుర వీధులలో ఏసు క్రీస్తుకు జేజేలు చెబుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. అలాగే టీసీసీ టౌన్ చర్చ్, సీలోహు, జెరూషలేము తదితర చర్చీలలో ఆయా పాస్టర్ల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.


ఈత మట్టలతో ఊరేగింపుగా వెళ్తున్న క్రైస్తవులు

పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశాలకు ఉచిత శిక్షణ


కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాలీసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశాలకు ఉచిత శిక్షణ కార్యక్రమం ఈనెల 28వ తేదీనుంచి ప్రారంభం కానున్నట్లు సేవాసమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 10వ తరగతి పరీక్షలు రాసి ఉన్నత చదువుల ప్రవేశ పరీక్షలకు హాజరయ్యేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఎస్‌వి సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, శ్రీదేవి, సుబ్బిరెడ్డిలతో కలసి విడుదల చేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్

కడప కార్పొరేషన్ : రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందు హిందూ, ముస్లింల మధ్య సోదర భావాన్ని పెంపొందిస్తుందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. ఆదివారం సాయంత్రం కడప నగరంలోని 2వ డివిజన్ తిలక్ నగర్‌లోని రహమతుల్లా మసీదులో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 30 రోజులపాటు ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్ష చేపడుతారని, ఉపవాస దీక్ష ముగిసే సమయంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తారన్నారు. ముస్లిం మైనార్టీలు ఈ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు.

ఏమి హాయిలే..

పులివెందుల రూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగ పలు గ్రామాలలో నీరు ఉన్న బోరు బావులలో ఎండ వేడిమి తాళలేక ఉపశమనం కోసం ఇలా బావులలోను కాలువలలోను ఈత కోడుతూ యువకులు సేద తీరుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం కోసం గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ఈతకు వెళ్తూ ఏమి హాయిలే ఇలా అంటు సరదగా ఈత కోడుతున్నారు. రోజు రోజుకు ఎండలు తీవ్రత ఎక్కువ కావడంతో చాలా మంది ప్రజలు ఎక్కువ సేపు బావులలోను, కాలువల్లో ఈత కొడుతూ గడిపేస్తున్నారు.


బావులలో ఈత కోడుతున్న యువకులు

నేడు అయ్యప్పస్వామికి ప్రత్యే పూజలు

పులివెందుల టౌన్ : శబరిమల హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం పార్నపల్లె రోడ్డులోని కోతి సమాధి ఆలయం వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు గురస్వామి వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, 6.30 గంటలకు తీర్థప్రసాదాల వినియోగం ప్రత్యేక అలంకారాలతోపాటు విశేష పూజలు ఉంటాయన్నారు. అలాగే సాయంత్రం అయ్యప్ప, ఆంజనేయ స్వామి భజనమండలి వారిచే తాళాల భజనలు నిర్వహించి భక్తులకు అల్పాహారవిందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించి తరించాలని ఆయన కోరారు.

సామూహిక లక్ష్మీ పూజ

వల్లూరు : మండలంలోని మాచిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవ రోజైన ఆదివారం సామూహిక లక్ష్మీపూజ కార్యక్రమం సాంప్రదాయ బద్ధంగా జరిగింది. శ్రీ లక్ష్మీ నరసింహ స్వాముల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు పసుపు ముద్దలతో లక్ష్మీదేవి ప్రతిమలను చేసి దీపాలను వెలిగించి మహిళలచే కుంకుమార్చనను నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో మూల మంత్ర, నవగ్రహ జపాలను, వివిధ హోమాలను వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి జరిగిన తాళం భజన పోటీ లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉదయం ట్రాక్టర్ రివర్స్ పోటీలు జరిగాయి.

బంజారా సంప్రదాయ పద్ధతిలో హోలీ

కడప కార్పొరేషన్ : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట స్వామి ఆధ్వర్యంలో హోలీ పండుగ బంజారా సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రిమ్స్ సమీపంలోని గిరిజన భవన్‌లో దాదాపు 700 మంది బంజారాలు ఈ కార్యక్రమంలో పాల్గొని కట్టెలు వెలిగించి నవ ధాన్యాలతో కుంకుమ రంగు, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అందరూ బంజారా దుస్తులు వేసుకొని రుచికరమైన విందు ఆరగించి, రంగులు చల్లుకొని సంతోషంగా గడిపారు.

నేడు చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. వేకువ జామున స్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ఆరు గంటలకు లోక కళ్యాణార్థం గణపతి, నవగ్రహ, చండీ హోమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

గంగమ్మ మమ్మల్ని కాపాడమ్మా


గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

వేంపల్లె : స్థానిక పెద్ద దేవరగడ్డ వీధిలో వెలసిన గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం స్థానికులు ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని 101 బిందెల నీటితో అభిషేకం చేశారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని దీపాలు వెలిగించి గంగమ్మ మమ్మల్ని కాపాడమ్మా అని వేడుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు సంబూరు కుళ్లాయప్ప, కటిక చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోకుంటే మనుగడ కష్టం

కడప కల్చరల్ : ప్రకృతిని కాపాడుకోకుంటే మానవాళికి మనుగడ కష్టమేనని భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి అన్నారు. కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు ఆదివారం ఇంటాక్ జిల్లా చాప్టర్ ఆధ్వర్యంలో స్థానిక పాలకొండల వద్ద గల నగరవనంలో సంస్థ సభ్యులు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కరువులు, నీటి ఎద్దడి ప్రకృతిని నిర్లక్ష్యం చేసినందుకు ఫలితమేనన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిపై నేటి తరానికి అవగాహన కల్పించేందుకు ఈ వాక్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పూర్వం దైవ క్షేత్రాలన్నీ అడవుల్లోనే ఏర్పాటు చేయడం వెనుక ప్రకృతికి దగ్గరగా ఉండేందుకేనన్నారు. ప్రకృతిని పరిరక్షించుకోవడంలో భాగంగా ఇంటాక్ చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సతీష్‌రెడ్డి

వేముల : మండలంలోని నారేపల్లె గ్రామంలో ఉన్న భైరవేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాగేళ్ల చంద్రారెడ్డిలు తెలుగుదేశం పార్టీ వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం వైఎస్సార్ సీపీ నేత సతీష్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వారితో పాటు 20 కుటుంబాలు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే గ్రామానికి చెందిన మాజీ చైర్మన్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మురళి మోహన్‌రెడ్డి, శివగంగిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డితో పాటు వారి అనుచరుల కుటుంబాలు వైఎస్సాఆర్‌సీ పార్టీలో చేరారు. సతీష్‌రెడ్డి వారితో మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడి పనిచేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించు కోవాలన్నారు.

నవరత్నాలతో ప్రజలకు ఎంతో లబ్ధి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన నవరత్నాలతో ప్రజలు ఎంతో లబ్ధిపొందారని వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రజలను వేడుకున్నారు. మండలంలోని గూడెంచెరువు గ్రామంలో నర్విహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను వైద్యుడను తనకు ప్రాణం పోయడమే తప్ప ప్రాణాలను తీయడం తెలియదన్నారు. గతంలో ఉన్న నాయకులు ఫ్యాక్షన్‌ను ప్రొత్సహించేవారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎంపికైన నాలుగున్నర సంవత్సరాల కాలంలో చిన్న సంఘటనలు కూడా నియోజకవర్గంలో జరుగలేదన్నారు. టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చేసిన మోసాలు, ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయాడన్నారు. చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు వైఎస్సార్ నేతన్న నేస్తంతోపాటు, 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్ వస్తోందన్నారు. ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆగస్టిన్‌రాజు, వెంకటరమణ, నాగేశ్వర్‌రెడ్డి, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

క్షయవ్యాధి నివారణకు కృషిచేయండి

వేంపల్లె : క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు స్వాతిసాయి తెలిపారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంచి వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తారన్నారు. క్షయవ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధి ఉన్న వారు పౌష్టికాహారంతో పాటు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు నిజాముద్దీన్, హెచ్ఈ షఫీ ఉన్నిసా, సూపర్‌వైజర్ లక్ష్మితేజా తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న వైద్యులు, ఏఎన్‌ఎంలు